

ప్రభుత్వ భూమి కబ్జా

ఏర్పేడు మండలం పెనుమల్లంలోని రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని టీడీపీ స్థానిక నేతలు కబ్జా చేసేశారు. - 8లో



యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

దైనందిన జీవితంతో ప్రతి ఒక్కరూ యోగాలను అలవాటుగా మార్చుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. - 8లో



దుకాణాల కూల్చివేతపై ధర్నా

బొంతాలమ్మ గుడి వద్ద వీధి వ్యాపారుల షాపుల7 కూల్చివేతపై బుధవారం ఏఐటీయూసీ నేతలు ధర్నాకు దిగారు. - 8లో

న్యూస్‌రీల్

కార్యకర్తలకు అండగా ఉండాలని ఆదేశం



వైఎస్ జగన్‌కు వినతిపత్రం అందిస్తున్న నూకతోటి రాజేష్, బీరేంద్రవర్మ

వరదయ్యపాళెం : వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ సత్యవేడు నియోజక వర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ బుధవారం తాడేపల్లె కేంద్ర కార్యాలయంలో కలిశారు. కూటమి నేతల ఆగడాలపై రాతపూర్వకంగా వినతిపత్రం అందించారు. వైఎస్ జగన్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు అండగా ఉండాలని ఆదేశించారు. కూటమి నేతల దౌర్జన్యాలను ధైర్యంగా ఎదుర్కోవాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తాడిపత్రి నియోజకవర్గ పరిశీలకుడు బీరేంద్ర వర్మ, సత్యవేడు మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ నిరంజన్ రెడ్డి, నేతలు చంద్రశేఖర్ రెడ్డి, బెల్లు రమేష్, ఎంపీపీలు దివాకర్ రెడ్డి, ప్రతిమారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆన్‌కాల్ డ్రైవర్ పోస్టులకు దరఖాస్తులు

తిరుపతి అర్బన్ : మంగళం ఆర్టీసీ డిపోలో ఆన్ కాల్ డ్రైవర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు డీఎం కేసీడీ భాస్కర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొంది 18 నెలలు పూర్తి అయిన వారు మాత్రమే అర్హులని వెల్లడించారు. ఆసక్తిగలవారు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మంగళం డిపోలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. ప్రతి రోజూ డ్యూటీ దిగిన తర్వాత వేతనం చెల్లించేస్తామని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు 9177150347 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పద్మావతి ఆస్పత్రిలో ఓబెస్ట్రిక్స్ మెడిసిన్ ప్రత్యేక ఓపీ

తిరుపతి తుడా : స్విమ్స్ పరిధిలోని పద్మావతి ఆస్పత్రిలో ప్రతి గురువారం ఓబెస్ట్రిక్స్ మెడిసిన్ ప్రత్యేక ఓపీ నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గర్భిణుల్లో బీపీ, షుగర్, థైరాయిడ్, ఇతర సమస్యలు ఉన్న వారిని ముందస్తుగా గుర్తించి, సకాలంలో వైద్యం అందించేందుకు ఈ ప్రత్యేక ఓపీని ప్రారంభిస్తున్నామని వివరించారు. పద్మావతి ఆస్పత్రిలో మధ్యాహ్నం 12గంటలకు రూమ్ నంబర్ 22లో ఓబెస్ట్రిక్స్ మెడిసిన్ ఓపీ ఉంటుందని తెలిపారు.

ఏపీ ఈఏపీసెట్ కేంద్రం పరిశీలన

తిరుపతి సిటీ : ఏపీ ఈఏపీ సెట్ నిర్వహిస్తున్న తిరుపతి జూపార్క్ సమీపంలోని అయాన్ డిజిటల్ కేంద్రాన్ని ఎస్వీయూ వీసీ అప్పారావు బుధవారం పరిశీలించారు. వీసీ మాట్లాడుతూ ప్రశాంతవాతావరణంలో పరీక్షలు జరుగుతున్నాయన్నారు. విద్యార్థులకు పక్కాగా మౌలిక వసతులు కల్పించినట్లు వివరించారు.

వెలగని దీపం

"సూపర్ సిక్స్ హామీలన్నీ నెరవేరుస్తాం. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం" అంటూ కూటమి ప్రభుత్వం ఇప్పటికీ ఊదరగొడుతోంది. అందులో భాగంగానే ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని ఆర్భాటంగా ప్రకటించింది. దీపం–2 పేరుతో ప్రతిష్టాత్మకంగా పథకం అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంది. నగదు చెల్లించి వంట గ్యాస్ బండ తీసుకున్న 48 గంటల్లోనే రీఫండ్ చేస్తున్నామని జబ్బలు చరుచుకుంది. తొలి విడతలో లబ్ధిదారుల ఖాతాల్లో సక్రమంగానే సొమ్ము జమ చేసింది. అయితే రెండో దశకు వచ్చేసరికి ఉచిత గ్యాస్ తుస్సుమంది. సిలిండర్ తీసుకున్న వారికి వారాలు గడుస్తున్నప్పటికీ డబ్బులు వేయకుండా ఏమారుస్తోంది.



జిల్లా సమాచారం	
మొత్తం రేషన్ కార్డులు	5,97,430
గ్యాస్ ఏజెన్సీలు	41
గ్యాస్ కనెక్షన్లు	4,92,404
తొలి విడతలో ఉచితంగా ఇచ్చిన సిలిండర్లు	2.40 లక్షలు
ఏటా మూడు దశల్లో ఇవ్వాల్సినవి	18.09 లక్షలు

రెండో విడతలో అందని గ్యాస్ సబ్సిడీ

- ఆందోళనలో దీపం–2 పథకం లబ్ధిదారులు
- సిలిండర్‌కు చెల్లించిన నగదు రీఫండ్ కాకపోవడంతో ఆగ్రహం
- రోజుకో మాట చెబుతున్న అధికారులు



తిరుపతి అర్బన్ : జిల్లాలో దీపం– 2 పథకం అప్పుడే కొడిగట్టుతోంది. నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున ఏడాదికి మూడు సిలిండర్లను ఉచితంగా అందిస్తామని కూటమి ప్రభుత్వం వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే ఏప్రిల్ 1వ తేదీ నుంచి రెండో విడత సిలెండర్ బుక్ చేసిన వారి బ్యాంక్ ఖాతాలో నగదు జమ కాకపోవడంతో పలువురు మండిపడుతున్నారు. మొదటి విడతలో 4.92 లక్షలకు కాను 2.40లక్షలకు మాత్రమే నగదు రీఫండ్ చేసినట్లు లెక్కలు చూపుతున్నారు. సగం మందికి సొమ్ము చెల్లించలేదని విమర్శిస్తున్నారు. అయితే 50 శాతం మంది మాత్రమే గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్నారని, వారికి మాత్రమే నగదు జమ చేశామని అధికారులు వివరిస్తున్నారు. రెండో విడత విషయంలో 90శాతం మందికి రీఫండ్ చేయకపోవడంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులేమో సర్వర్, ఆధార్ లింకేజీ సమస్యల కారణంగా ఉచిత గ్యాస్ నగదు జమ కావడంలేదని చేతులు దులిపేసుకుంటున్నారు. తొలి ఏడాదే రెండో విడతకే పరిస్థితి ఇలా ఉంటే.. రాబోయే కాలంలో ఇంకెన్ని ఇబ్బందులు ఎదుర్కోవాలో అని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

20 రోజులు గడిచాయి

ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పారు. నాలుగు నెలలకు ఒక సిలిండర్ అని లెక్కవేశారు. అప్పటి వరకు ఒక్క సిలిండర్ సరిపోదు. సరే ఏదో ఇస్తామని చెప్పారు. సక్రమంగా ఇవ్వాల్సిన బాధ్యత ఉంది. మొదటి సిలిండర్ బుక్ చేసుకుంటే నగదు వేశారు. రెండో సిలిండర్‌కి ఇవ్వలేదు. 20 రోజులు గడుస్తోంది. మా డీలర్‌ను అడిగితే పడుతుందిలే అంటున్నారు. ఎప్పుడు పడుతుందో ఏమో తెలియడం లేదు.

– రత్నమ్మ, శ్రీకాళహస్తి మండలం

చేసింది ఒక్కటే.. అదీ ఇలా..

సూపర్‌సిక్స్ పథకాల్లో కూటమి ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం ఒక్కటే. అదీ ఇలా సక్రమంగా ఇవ్వకుంటే ఏం చేయాలి. తల్లికివందనం లేదు...అన్నదాత సుఖీభవ లేదు...నిరుద్యోగభృతి లేదు. ఉచిత బస్సు ప్రయాణం లేదు. ఈ ప్రభుత్వాన్ని ప్రజలు ఎలా నమ్మాలి. గ్యాస్ సిలిండర్ తీసుకుని 18 రోజులు గడుస్తోంది. అయినా రాయితీ జమ కాలేదు.

– రాణెమ్మ, తిరుపతి

డబ్బులు జమ కాలేదు

ఉచిత గ్యాస్ పథకం కింద సిలిండర్ బుక్ చేసుకున్నాం. సిలిండర్ ఇంటికి వచ్చింది. నగదు చెల్లించాం. అయితే మేము కట్టిన డబ్బులు మాత్రం మా బ్యాంక్ ఖాతాలో జమ కాలేదు. మొదటి సారి వచ్చింది. ఈసారి ఎందుకు రాలేదో తెలియడం లేదు. అధికారులను అడిగితే వస్తుందని చెబుతూనే ఉన్నారు. ఇప్పటికే రెండు వారాలవుతోంది.

– లక్ష్మి, ఏర్పేడు మండలం

నాలుగు రోజుల్లో నగదు జమ చేస్తాం



దీపం–2 పథకం ద్వారా రెండో సిలిండర్ బుకింగ్ చేసుకున్న వారి బ్యాంక్ ఖాతాలో నగదు జమ చేస్తారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఈ అంశంపై మీటింగ్ నిర్వహించారు. ఆ మేరకు రాష్ట్రస్థాయి అధికారులతోను మాట్లాడారు. అయితే నాలుగు రోజుల్లో వేస్తామని చెప్పారు. ఈ విషయంలో లబ్ధిదారులు భయపడాల్సిన అవసరం లేదు.

– శేషాచలం రాజు, పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి

'అమృత్' స్టేషన్.. అభినందనీయం



విద్యుద్దీపాల వెలుగుల్లో సూళ్లూరుపేట రైల్వేస్టేషన్



ఎంపీ గురుమూర్తి

సూళ్లూరుపేట : అమృత్ స్టేషన్ పథకం కింద సూళ్లూరుపేట రైల్వే స్టేషన్‌ను అత్యాధునిక వసతులతో అభివృద్ధి చేయడం అభినందనీయమని ఎంపీ గురుమూర్తి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అద్భుతంగా తీర్చిదిద్దిన రైల్వేస్టేషన్‌ను గురువారం రాత్రి వర్చువల్ విధానంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రారంభిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి ప్రతిష్టాత్మక కార్యక్రమానికి తనను ఆహ్వానించినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పలుమార్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రిని కలిసి సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలని విన్నవించినట్లు వెల్లడించారు. షార్‌తోపాటు శ్రీసిటీ, మాంబట్టు, మేనకూరు సెజ్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన వేలాది మంది పనిచేస్తున్నారని, సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తే అందరికీ సౌకర్యంగా ఉంటుందని కోరినట్లు వివరించారు. తమ విన్నపాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి అమృత్ స్టేషన్ పథకం కింద ఆధునీకరించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ క్రమంలోనే ఉత్తర భారతదేశానికి వెళేఓల ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సైతం సూళ్లూరుపేటలో స్టాపింగ్ ఇవ్వాలని ఎంపీ గురుమూర్తి కోరారు.

జూన్ 21 వరకు యోగా మాసోత్సవాలు



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

- ఎస్వీయూ వీసీ, రిజిస్ట్రార్
- యోగాంధ్ర–2025 ప్రచార బ్రోచర్ ఆవిష్కరణ

తిరుపతి సిటీ: రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న యోగాంధ్ర–2025 ప్రచారానికి మద్దతుగా ఎస్వీయూలో గురువారం నుంచి జూన్ 21వ తేదీ వరకు యోగా మాసం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు తెలిపారు. వారు బుధవారం ప్రత్యేక ప్రచార బ్రోచర్‌ను విడుదల చేశారు. వారు మట్లాడుతూ యోగా వల్ల మనిషిలో అంతర్గత సమతుల్యత, మానసిక దృఢత్వం, సమగ్ర శ్రేయస్సుకు కలుగుతాయన్నారు. ఆరోగ్యకరమైన, మేధోసమాజాన్ని నిర్మించాలన్న ప్రభుత్వ దార్శనికతకు మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రతి ఒక్కరికీ మానసిక, శారీరక ఆరోగ్యం అవసరమని, సమాజంలో ఇటువంటి పద్ధతులను ప్రోత్సహించడానికి విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందన్నారు. ఇందులో భాగంగానే యోగా మాసం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ప్రతిరోజూ ఉదయం 8:20 నుంచి 9 గంటల వరకు అడ్మినిస్ట్రేటివ్ భవనం ఎదుట యోగా సెషన్లు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రూసా సీఈవో వంశీ రాయల్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య టి.దామోదరం, పరీక్షల డీన్ ఆచార్య ఎస్.కిషోర్, అసిస్టెంట్ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ హరికృష్ణ యాదవ్, కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.వివేక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి అర్బన్ : రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అన్నిశాఖల అధికారులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో కలిసి రహదారి భద్రతా కమిటీ సభ్యులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ హైవేపై ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించే డ్రైవింగ్ చేయాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాలపై సమగ్ర సమాచారం కోసం ఆడిట్ నిర్వహించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా జాతీయ రహదారుల్లో ఇప్పటి వరకు100 బ్లాక్ స్పాట్లు గుర్తించినట్లు తెలిసిందని, దీనిపై అధికారులు స్పష్టంగా నివేదిక ఇవ్వాలని కోరారు. అలాగే తిరుమల ఘాట్ రోడ్డులోకి ఫిట్‌నెస్ ఉండే వాహనాలను మాత్రమే అనుమతించాలన్నారు. అలాగే ఘాట్ రోడ్డును నాన్‌స్టాప్ జోన్‌గా గుర్తించాలని ఆదేశించారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాంగ్ రూట్‌లో డ్రైవింగ్ చేస్తే కేసు నమోదు చేసి రూ.2వేల జరిమానా విధించాలని స్పష్టం చేశారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగితే 1033 టోల్ ఫ్రీ నంబర్‌కు ప్రజలు కాల్ చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. హిట్ అండ్ రన్‌పై స్పష్టమైన నివేదికలు ఎప్పటికప్పుడు సమర్పించాలని కోరారు. ఈ మేరకు బాధిత కుటుంబాలు ఇన్సూరెన్స్ పొందే వెసులుబాటు ఉంటుందని వివరించారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ జాతీయ రహదారులపై వెళుతున్న ద్విచక్రవాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలను తెలియజేయాలన్నారు. ప్రస్కూల్స్ బస్సులను ఆర్టీఓ అధికారులు తరచూ తనిఖీ చేయాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో కచ్చితంగా రూల్స్ పాటించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రవాణాశాఖ అధికారి మురళీమోహన్, ఆర్‌అండ్‌బీ ఎస్ఐ మధుసూదన్, తిరుపతి, నెల్లూరు, చెన్నై జాతీయ రహదారుల పీడీలు వెంకటేశ్వర్లు, ఎంకే చౌదరి, విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ బాలకృష్ణ నాయక్, తుడా ఏఈ రవీంద్ర పాల్గొన్నారు.

నేడు తిరుమలలో ట్రాఫిక్ ఆంక్షలు

తిరుమల : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం తిరుమలలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. జపాలి తీర్థం వెళ్లేందుకు భక్తులు పోటెత్తనున్న నేపథ్యంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 8 గంటల వరకు ట్రాఫిక్ ఇక్కట్లు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఈ మేరకు సుమారు 10వేల నుంచి 15వేల వాహనాలు తిరుమలకు వచ్చే అవకాశమున్నట్లు పోలీసులు వెల్లడించారు. ప్రైవేట్ వాహనాలను ఆక్టోపస్ సర్కిల్ వరకు మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. అక్కడ నుంచి భక్తులు కేవలం ఆర్టీసీ బస్సుల్లో మాత్రమే జపాలి తీర్థం, పాపవినాశనం వెళ్లాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

24 వరకు ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉన్నట్లు తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్/కన్వీనర్ వి.శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు "ఐటీఐ.ఏపీ.జీఓవి.ఇన్" వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను మే 26వ తేదీలోపు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో పరిశీలన చేయించుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 94928 61369, 85000 21856, 94908 06942, 93989 62635 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సనాతన ధర్మ ప్రచారానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న టీటీడీ ఈఓ శ్యామలరావు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : యువతను భక్తిమార్గం దిశగా నడిపించేందుకు సనాతన ధర్మ ప్రచారానికి ఎస్వీబీసీలో ప్రాధాన్యమిచ్చేలా కార్యక్రమాలు రూపొందించాలని టీటీడీ ఈఓ శ్యామలరావు ఆదేశించారు. బుధవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో ఎస్వీబీసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ తిరుమల ప్రాముఖ్యత, వైష్ణవ సాంప్రదాయాలు, పచ్చదనం, దాస సాహిత్యం, భక్తులకు అందిస్తున్న సేవలు, హైందవ ధర్మ మూలాలను పిల్లలక సైతం తెలియజేయాలన్నారు. భజన సంప్రదాయాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ భాషల్లో సృజనాత్మక కార్యక్రమాలను ప్రసారం చేయాలని స్పష్టం చేశారు. వర్చువల్‌గా అడిషనల్ ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి, జేఈఓ వీరబ్రహ్మం, ఎస్వీబీసీ ఓఎస్డీ పద్మావతి పాల్గొన్నారు.

దశాబ్దాలుగా సీమవాసుల కల.. పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధుల ఆకాంక్ష.. ఏళ్ల తరబడి నిరీక్షణ.. తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన.. ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. విశాఖ రైల్వేజోన్ ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్న నేపథ్యంలో రాయలసీమ వాసుల్లో ఆశలు చిగురించాయి. ప్రత్యేక డివిజన్ కోసం మళ్లీ ప్రయత్నాలు మొదలుపెట్టాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ మేరకు నిపుణుల నుంచి సైతం సానుకూల అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



దశాబ్దాల డివిజన్

- కలగానే బాలాజీ రైల్వే డివిజన్
- ఏళ్ల తరబడి ప్రజల నిరీక్షణ
- కార్యరూపం దాల్చని ప్రతిపాదన

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన దాదాపు రెండు దశాబ్దాలుగా ఉంది. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ప్రకటించడంపై హర్షం వ్యక్తమవుతున్నా మరోవైపు బాలాజీ డివిజన్ అంశం తెరపైకి వచ్చింది. సీమ ప్రజాప్రతినిధుల నుంచి నుంచి కేంద్రానికి ప్రతిపాదనలు సైతం వెళ్లాయి.


అధికారులు సానుకూలమే..

గుంతకల్ డివిజన్ కేంద్రానికి తరచూ సమావేశాలకు వెళ్లి రావాలంటే రైల్వే అధికారులు, కార్మికులకు ప్రయాణం కష్టతంగా మారింది. ఈ క్రమంలో గుంతకల్, గుంటూరు, విజయవాడ నాలుగు డివిజన్లతో పాటు కొత్తగా బాలాజీ డివిజన్ ఏర్పాటు చేసి విశాఖ జోన్‌లో కలిపితే సౌకర్యంగా ఉంటుందని రైల్వే నిపుణులు వెల్లడిస్తున్నారు. ఆ దిశగా ఎంపీలు కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖపై ఒత్తిడి తీసుకురావాలని రాయలసీమ వాసులు సైతం కోరుతున్నారు.

డివిజన్ ఏర్పాటైతే..

బాలాజీ డివిజన్ ఏర్పాటైతే ఇందులో తిరుపతి–గూడూరు (92.96కిమీ), తిరుపతి–కాట్పాడి (104.39కిమీ), పాకాల–మదనపల్లె (83కిమీ), రేణిగుంట–కడప (125కిమీ)లైను కలిపే అంశాలను ఇదివరకే రైల్వే అధికారులు పరిశీలించారు. నంద్యాల–పెండేకల్లు (102కిమీ)లైను గుంటూరు డివిజన్‌లోకి విలీనం చేయాలని సూచించారు. అలాగే జిల్లా మీదుగా వెలుగొండ అడవుల నుంచి వెళ్లే కృష్ణపట్నం రైల్వేలైన్ కూడా విజయవాడ డివిజన్‌లోకి వెళ్లింది. కొత్త డివిజన్ ఏర్పడితే తిరుపతి రైల్వే కేంద్రం అత్యంత ప్రాధాన్యత సంతరించుకునే అవకాశముంది. బాలాజీ డివిజన్ కేంద్రానికి దగ్గరలోని రేణిగుంట జంక్షన్‌కు ప్రాముఖ్యత ఉంది. విశాఖ జోన్ ఏర్పడుతున్న నేపథ్యంలో గుంతకల్ డివిజన్ నుంచి వేరుచేసి ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా వరకు బాలాజీ డివిజన్‌గా ఏర్పాటు చేసే ప్రతిపాదనను కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకువెళ్లాలని నిపుణులు కోరుతున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని సూచిస్తున్నారు. విశాఖ జోన్ ఏర్పాటు క్రమంలో బాలాజీ డివిజన్ ఏర్పాటు ఆవశ్యకత వివరించాలని స్పష్టం చేస్తున్నారు. దీంతో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాలల్లో పరిశ్రమల స్థాపనకు మార్గం మరింత సుగమం అవుతుందని వివరిస్తున్నారు.

ఉగ్ర సాగరం



ఎగసి పడుతున్న కెరటాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి కారణంగా గత రెండు రోజులుగా వాతావరణంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. బుధవారం సాగర కెరటాలు ఉగ్ర రూపంతో ఉవ్వెత్తున ఎగసి పడ్డాయి. సముద్రం అల్లకల్లోలంగా మారింది. ఏ క్షణం ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేశారు. – వాకాడు



తీర ప్రాంతంలో ఓ వైపు ఎండ, మరో వైపు కారు మబ్బులు

క్లుప్తంగా

ప్రభుత్వ భూమి కబ్జా



ఆక్రమిత స్థలంలో నిర్మిస్తున్న ఇల్లు

ఏర్పేడు : మండలంలోని పెనుమల్లం సమీపంలో రూ.కోట్లు విలువైన ప్రభుత్వ భూమిని టీడీపీ స్థానిక నేతలు కబ్జా చేసేశారు. వివరాలు.. గ్రామంలోని ఇరగలప్పచలం ఆలయానికి వెళ్లే మార్గంలో సర్వే నంబర్ 183లో 3.92 ఎకరాలు, సర్వే నంబర్ 182–1లో 4.40 ఎకరాల చిట్టేటి గుంట పోరంబోకు భూమి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీకి చెందిన బొజ్జ శంకరయ్య, పెరుమాళ్ అనే వ్యక్తులు సదరు భూమిని ఆక్రమించేశారు. బొజ్జా శంకరయ్య ఏకంగా ఇల్లు నిర్మిస్తున్నాడు. మిగిలిన స్థలాన్ని జేసీబీతో చదును చేయించేశాడు. ఈ ప్రాంతంలో ఎకరా రూ.50 లక్షలు వరకు ధర పలుకుతోంది. ఆక్రమణపై స్థానికులు ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

పాలమంగళం విద్యార్థికి అవార్డు



మంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న ఆశిష్

నారాయణవనం: పాలమంగళం ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి ఆశిష్‌కు షైనింగ్ స్టార్ అవార్డు దక్కింది. విభిన్న ప్రతిభావంతుడైన ఆశిష్ 500 మార్కులకు గాను 481 సాధించి రాష్ట్రస్థాయిలో మూడో స్థానం, జిల్లా టాపర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం మంగళగిరిలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతులమీదుగా అవార్డు అందుకున్నాడు. బుధవారం ఈ మేరకు పాఠశాల హెచ్‌ఎం మనోహరి మాట్లాడుతూ ఆశిష్ మనోధైర్యంతో అంగ వైకల్యం జయించాడని ప్రశంసించారు.

రోడ్డు ప్రమాదంలో జింక మృతి



తిరుమల: తిరుమలలోని రింగ్ రోడ్డులో ప్రమాదవశాత్తు జింక మృతి చెందింది. ఈ ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. తిరుమలలోని గ్యాస్ గోడౌన్ సమీపం రింగ్ రోడ్లో రోడ్డు దాటుతున్న జింకను గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. దీంతో జింక అక్కడికక్కడే మృతిచెందింది. ఫారెస్ట్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని జింక కళేబరాన్ని తిరుపతిలోని వెటర్నరీ ఆస్పత్రికి తరలించారు.

మసూర బియ్యం పేరుతో టోకరా



రేషన్ బియ్యం

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యం దళితవాడలో బుధవారం ఇద్దరు వ్యక్తులు మసూర బియ్యం పేరుతో స్థానికులకు టోకరా పెట్టారు. ఇద్దరు వ్యక్తులు గ్రామంలోకి స్కూటర్లపై బియ్యం బస్తాలను వేసుకొచ్చారు. ఒక్కో బస్తా రూ.వెయ్యి చొప్పున విక్రయించి వెళ్లారు. తీరా మూట విప్పి చూస్తే అవి రేషన్ బియ్యం కావడంతో స్థానికులు అవాక్కయ్యారు. రెండు నెలల క్రితం కూడా వెంకటాపురం పంచాయతీలో ఇలాంటి ఘటనే చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు. అయితే దీనిపై స్థానిక పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

బెల్లం రైతుకు బేడీలు





బెల్లం తయారీలో రైతులు

కూటమి ప్రభుత్వం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో బెల్లం సాగు చేసే రైతుకు బేడీలు వేస్తోంది. సాక్షాత్తు సీఎం ఇలాకాలో బెల్లం సాగు చేసే రైతులు జైలు ఊచలు లెక్కపెడుతున్నారు. వారు దొంగతనం, హత్యలు చేయలేదు. కానీ అలాంటి వారికి వేసే శిక్షలు ఆరుగాలం శ్రమించే అన్నదాతకు పడేలా చేస్తుండడం విస్మయానికి గురిచేస్తోంది. బెల్లం సాగు చేసే రైతులు బెల్లం అమ్మడం నేరమా? బెల్లం తీసుకొని పోయినవారు సారా కాస్తారా.. కాఫీ చేసుకుంటారా రైతుకు ఎలా తెలుస్తుంది? కానీ సారా కాసే వాళ్లను వదిలేసి.. బెల్లం సాగు చేసే రైతులను జైలుపాలు చేస్తుండడంపై అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

- నల్లబెల్లం పేరిట అన్నదాతల అరెస్టులు
- సారా తయారీకి బెల్లం విక్రయిస్తున్నారని సంకెళ్లు
- అక్రమంగా రైతుల అరెస్టులు.. నోటీసులు
- అన్నదాతలకు 'కూటమి సర్కారు' ఝలక్
- ట్రేడర్లకే విక్రయించాలంటున్న ఎక్సైజ్ పోలీసులు

‘ఈ చిత్రంలో భార్య, బిడ్డలతో తన చెరకు తోట, ట్రాక్టర్‌తో కలిసి ఉన్న రైతు పేరు పెరుమాల్. గతేడాది ఆయుధపూజ నేపథ్యంలో చెరకు పంట ఓ మోస్తరుగా వస్తుండడంతో ఇలా ఫొటో తీసుకున్నాడు. కానీ ఇప్పుడు పెరుమాల్ చిత్తూరు జిల్లా జైలులో ఊచలు లెక్కిస్తున్నాడు.. కారణం.. పెరుమాల్ రైతు కావడం, తన వద్ద నల్ల బెల్లం కొన్న వ్యక్తులు సారా తయారు చేశారంట.’




కుటుంబ సభ్యులతో చెరకు పంట వద్ద రైతు పెరుమాళ్

చిత్తూరు అర్బన్ : ఉమ్మడి చిత్తూరుజిల్లాలో రైతులు పండించే ప్రధాన పంటల్లో చెరకు ఒకటి. ఇక్కడి నల్లరేగడి భూముల కారణంగా చాలా వరకు బెల్లం నలుపు రంగులో తయారవుతుంది. కొన్ని రకాల రసాయనాలు, ప్రాసెసింగ్ చేస్తే బెల్లం రంగు మారుతుంది. కానీ గిట్టుబాటు ధర దక్కదు. దీంతో చాలా మంది నల్లబెల్లాన్ని తయారు చేసి మండీలు, అవసరం ఉన్న వాళ్లకు, ట్రేడర్లకు అమ్ముతున్నారు. ఇదే ఇప్పుడు రైతుల పాలిట శాపంగా మారింది. నల్లబెల్లం తయారీ, విక్రయాలపై కూటమి ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఆంక్షలు అతిక్రమిస్తున్న అన్నదాతలను నిర్దాక్షిణ్యంగా అరెస్టు చేసి జైలుకు పంపుతోంది. ప్రభుత్వ చర్యలపై రైతులు, రైతు సంఘం నేతలు మండిపడుతున్నారు.

గిట్టుబాటు ధర ఎక్కడ ?

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో దాదాపు 5 వేల హెక్టార్లలో చెరకు పంట సాగువుతోంది. ఇందులో చిత్తూరు నియోజకవర్గంలోని గుడిపాల, రూరల్, నగరి, నింద్ర, విజయపురం, గంగాధర నెల్లూరు, కార్వేటినగరం, పెనుమూరు, పుంగనూరు, పులిచెర్ల, ఎస్.పురం, వెదురుకుప్పం మండలాల్లో చెరకు పంట ఎక్కువగా పండిస్తున్నారు. వీటిల్లో 4500 హెక్టార్లలో పండే పంటను ఫ్యాక్టరీలకు విక్రయిస్తుండగా మిగిలిన 500 హెక్టార్ల నుంచి బెల్లం తయారీ చేస్తున్నారు. ఒక హెక్టారుకు 70 టన్నుల వరకు బెల్లం తయారు చేస్తున్నారు. ఇందులో దాదాపు 5 వేల టన్నుల వరకు నల్లబెల్లం ఉత్పత్తి అవుతోంది. కిలో నల్లబెల్లాన్ని మార్కెట్లో ట్రేడర్లకు విక్రయిస్తే రూ.24–27 మధ్య ధర వస్తుంది. ఇందులోనే రవాణా చార్జీలు, దళారుల కమీషన్లు పోనూ చేతికి రూ.15 దక్కడం గగనంగా మారుతోంది. గత ప్రభుత్వ హయాంలో నల్ల బెల్లానికి గిట్టుబాటు ధర కల్పించిన వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం.. మార్కెఫెడ్ ద్వారా బెల్లాన్ని కొనుగోలు చేయిస్తూ రైతులను ఆదుకుంది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ఘోరంగా విఫలమైంది.



చెరకు పాలు మరిగిస్తున్న రైతు

నవోదయంలో చీకట్లు

నాటుసారా తయారీ, విక్రయాలను అరికట్టడానికి కూటమి ప్రభుత్వం నవోదయం 2.0ను తీసుకొచ్చింది. సుదీర్ఘకాలంగా సారా తయారు చేస్తున్న కుటుంబాలను ఆ ఊబి నుంచి బయటపడేసి, వాళ్ల జీవన ప్రమాణాలు మార్చడానికి రుణాలు, ఇతర ప్రత్యామ్నాయ పనులను కల్పించాల్సిన ప్రభుత్వం రైతులపై పడింది. నాటు సారా తయారీకి నల్ల బెల్లం తప్పనిసరిగా వాడతారని, నల్లబెల్లం తయారు చేస్తున్న రైతులపై నిఘా ఉంచాలని, ఎవరెవరికి నల్లబెల్లం విక్రయిస్తున్నారు..? కొనుక్కునే వ్యక్తి ఆధార్ తీసుకున్నారా..? కిలో ఎంతకు అమ్ముతున్నారు..? అయిదు కిలోలకు పైబడి ఎవరికి అమ్ముతున్నారు..? అని వివరాల సేకరిస్తున్నారు. వాస్తవానికి బెల్లం తయారు చేసిన రైతులు దాన్ని మార్కెట్‌కు తరలించాలంటే తన రవాణాకు కిలోకు రూ.3, మార్కెట్‌లో కమిషన్ రూ.3 అదనపు సుంకంగా చెల్లించాలి. తీరా బెల్లాన్ని విక్రయించిన తరువాత తన పెట్టుబడి దక్కని పరిస్థితి. దీంతో కొందరు రైతులు బెల్లాన్ని మార్కెఫెడ్‌లో విక్రయించడంతో పాటు గ్రామాల్లో అమ్ముతుంటారు. రైతుల నుంచి బెల్లాన్ని కొన్నవాళ్లు దాన్ని ఫ్యాక్టరీలకు వాడతారో.. పశువులకు దాణాగా ఉపయోగిస్తారో అన్నదాతలకు తెలియదు. కానీ ఎవరైనా సారా తయారు చేస్తూ పట్టుబడితే, నిందితులు చెప్పిన మాటలను పరిగణలోకి తీసుకుని బెల్లం విక్రయించారనే నెపంతో రైతులను అరెస్టు చేయడం అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది.

ప్రభుత్వానికి దమ్ముంటే పంటను కొనుగోలు చేయాలి



వైఎస్.జగన్ సీఎంగా ఉన్నప్పుడు మార్క్‌ఫెడ్ ద్వారా నల్లబెల్లాన్ని కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచాం. సారాను నివారించడానికి పీడీ యాక్టులు పెట్టాం. కానీ టీడీపీ అధికారంలోకి వస్తేనే బెల్లం రైతులపై పడుతారు. గతంలోనూ అంతే, ఇప్పుడూ అదే కొనసాగుతోంది. మా నియోజకవర్గంలో ఎక్కువ మంది రైతులను అరెస్టు చేశారు. చంద్రబాబు అధికారంలోకి వస్తేనే జిల్లాలో బెల్లం రైతులకు ఇబ్బందులు తప్పవు. ఈ ప్రభుత్వానికి దమ్ముంటే నల్లబెల్లానికి గిట్టుబాటు ధర కల్పించి, పంటను కొనుగోలు చేయాలి. – ఎంసీ.విజయానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త

సారాకు బెల్లం విక్రయిస్తే అరెస్టు తప్పదు



సారా తయారీకి నల్ల బెల్లాన్ని విక్రయిస్తే చట్ట పరంగా ముందుకు వెళతాం. సారా తయారీ వాళ్లకు బెల్లం అమ్మారని తెలిసాకే అరెస్టు చేశాం. నవోదయంలో భాగంగా నాటు సారా తయారీ అరికట్టడానికి ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా సదస్సులు నిర్వహించి, బెల్లం వ్యాపారులు, రైతులకు అవగాహన కల్పించాం. ఫ్యాక్టరీలు, పశువుల కోసం నల్లబెల్లం అమ్మితే పర్లేదు. సారా కోసం అమ్మితే మాత్రం అరెస్టు తప్పదు. – శ్రీనివాస్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, చిత్తూరు

అరెస్టులపై ఉద్యమిస్తాం



ఎక్కడైనా సారా తయారు చేసే వాళ్లను అరెస్టు చేస్తారు. కానీ ఇక్కడ బెల్లం తయారు చేసే రైతులను అరెస్టు చేస్తున్నారు. ఇదెక్కడి న్యాయం.? నాటుసారా పేరిట రైతులను అరెస్టు చేసి జైలుకు తరలిస్తున్నారు. పొలాన్ని నమ్ముకున్న కుటుంబం రోడ్డున పడుతోంది. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ప్రభుత్వం ఇలాంటి చర్యలు ఆపకపోతే ఉద్యమం తప్పదు. – నాగరాజన్, సీపీఐ, చిత్తూరు జిల్లా కార్యదర్శి

కొత్త ట్రస్ట్ ఏర్పాటుపై పరిశీలించాలి



చికిత్సపొందుతున్న చిన్నారులను పరామర్శిస్తున్న ఈఓ శ్యామలరావు

తిరుపతి తుడా: శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో చిన్న పిల్లల ఆరోగ్య సంరక్షణ, వైద్య సేవల దృష్ట్యా టీటీడీలో కొత్తగా ఓ ట్రస్ట్ ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం చిన్నపిల్లల హృదయాలయాన్ని పరిశీలించారు. చిన్న పిల్లల ఐసీయూ బ్లాక్, జనరల్ వార్డు, ఓపీ బ్లాక్ లోని పిల్లలకు అందుతున్న వైద్యసేవలపై వైద్యులను, పిల్లల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పద్మావతి చిన్న పిల్లల హృదయాలయంలో ఇప్పటికే శ్రీ వేంకటేశ్వర ఆపన్న హృదయం స్కీం ఉందని తెలిపారు. దీని కింద దాత రూ.లక్ష విరాళం ఇస్తే నిరాదరణకు గురైన పేద పిల్లలకు ఉచితంగా ఆపరేషన్ చేసే సదుపాయం ఉందన్నారు. టీటీడీలో ఇప్పటికే ఉన్న పలు ట్రస్టుల తరహాలో నూతనంగా చిన్నపిల్లల వైద్య సేవల కోసం ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటుకు నియమ నిబంధనలపై నివేదిక తయారు చేయాలని సూచించారు. ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చే పసి బిడ్డలకు చక్కటి వైద్యం అందిస్తున్నారని కొనియాడారు. పిల్లలకు సంబంధించి గుండె చికిత్సలతో పాటు చిన్న పిల్లల గుండె ఆపరేషన్ల సంఖ్యను పెంచేందుకు అవసరమైన వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఆయన నూతన భవన నిర్మాణంపై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. తాజా పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ఎన్ శ్రీనాథ్ రెడ్డి, ఆర్‌ఎంవో డాక్టర్ భరత్, ఎస్‌ఈలు వేంకటేశ్వర్లు, మనోహరం పాల్గొన్నారు.

ఇంగ్లిష్ పరీక్షకు 400 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి సప్లిమెంటరీలో భాగంగా బుధవారం నిర్వహించిన ఇంగ్లిష్ పరీక్షకు 400 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు. ఈ పరీక్షకు 1,054 మందికి గాను 654మంది విద్యార్థులు హాజరైనట్లు వెల్లడించారు. ఓపెన్ స్కూల్‌కు సంబంధించి తెలుగు, ఉర్దూ, తమిళం పరీక్షలకు 269మందికి గాను 228మంది విద్యార్థులు హాజరైనట్లు వివరించారు. అలాగే ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ సప్లిమెంటరీలో భాగంగా నిర్వహించిన కెమిస్ట్రీ, ఎకనామిక్స్ పరీక్షలకు 555మందికి గాను 508మంది విద్యార్థులు వచ్చినట్లు తెలిపారు.

బదిలీల జాతర



బదిలీల కసరత్తు నిర్వహిస్తున్న విద్యాశాఖ సిబ్బంది

ఎప్పుడెప్పుడాని ఎదురుచూసిన టీచర్ల బదిలీల జాతరకు ఎట్టకేలకు రాష్ట్ర విద్యాశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బుధవారం బదిలీల ఉత్తర్వులను జారీ చేసింది. ఆ ఉత్తర్వుల మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని సర్కారు బడుల్లో విధులు నిర్వహిస్తున్న టీచర్ల బదిలీల ప్రక్రియ చేపట్టేందుకు చిత్తూరు విద్యాశాఖ అధికారులు కసరత్తు వేగవంతం చేశారు. పకడ్బందీగా బదిలీలు చేపట్టేందుకు జిల్లా విద్యాశాఖ రంగం సిద్ధం చేసింది.



- టీచర్ల ట్రాన్స్‌ఫర్లకు ఉత్తర్వులు
- కసరత్తు వేగవంతం చేసిన జిల్లా విద్యాశాఖ
- ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ప్రక్రియ
- ఎస్జీటీలకు మాన్యువల్‌గా చేపట్టనున్న వైనం
- ప్రత్యేక పోర్టల్ ప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల బదిలీలకు రాష్ట్ర విద్యాశాఖ బుధవారం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బదిలీల ప్రక్రియపై విద్యాశాఖ రాష్ట్రస్థాయి అధికారులు ఈనెల 21న డీఈఓలకు వెబెక్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ వెబెక్స్‌లో జిల్లా నుంచి డీఈఓ వరలక్ష్మి, ఏడీలు సుకుమార్, వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన చేపట్టే ఈ బదిలీలకు బుధవారం ట్రాన్స్‌ఫర్ పోర్టల్ ప్రారంభం అయింది. ఈ ప్రక్రియ జూన్ 5 నాటికి పూర్తి చేయనున్నారు. ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ఎస్‌ఏలకు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టనుండగా, ఎస్జీటీలకు మాన్యువల్‌గా బదిలీల ప్రక్రియ నిర్వహించనున్నారు.

హడావుడిగా దరఖాస్తు చేసుకోవాలని..

బదిలీ ఉత్తర్వులు విడుదలయ్యాయో లేదో అప్పుడే హడావుడిగా పలు కేడర్‌ల టీచర్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని పలు కేడర్‌ల టీచర్ల గందరగోళానికి లోనయ్యారు. కూటమి సర్కారు చేపడుతున్న తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెలాఖరుకు 5 సంవత్సరాలు ఒకేచోట పనిచేసిన హెచ్‌ఎంలు గురువారం సాయంత్రం 5గంటల్లోపు బదిలీ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రిఫరెన్షియల్ కేటగిరిలోని టీచర్లు మెడికల్ బోర్డు వెరిఫికేషన్‌కు బుధవారంతో గడువు పూర్తి కానుంది. బదిలీల్లోని సమస్యల పరిష్కారం కోసం మండల స్థాయిలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేపడుతున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో..

టీచర్ల బదిలీల కసరత్తు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో నిర్వహిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 4916 పాఠశాలలున్నాయి. వీటిలో 3766 ప్రాథమిక, 445 ప్రాథమికోన్నత, 705 ఉన్నత పాఠశాలలు.17,372 మంది టీచర్లకు గాను 15,454 పనిచేస్తున్నారు. 37 విభాగాల్లో 1918 పోస్టులను క్లియర్ వేకెన్సీలుగా చూపించగా, మరో 5082 ఖాళీలుగా చూపించారు. ఒకే పాఠశాలలో ఐదేళ్లు పూర్తి చేసిన హెచ్‌ఎంలు, 8 ఏళ్ల సరీ్వసు పూర్తి చేసుకున్న టీచర్లు తప్పనిసరిగా బదిలీ కానున్న నేపథ్యంలో 5/8 ఏళ్లు ఒకే చోట పనిచేసిన టీచర్ల ఖాళీలు 3 వేలు చూపగా, మిగులు కింద 500, స్కూల్ కొత్త పోస్టు లు (రీఅపోర్షన్), ఒక యాజమాన్య పాఠశాల నుంచి మరో యాజమాన్య పాఠశాలల్లో నెలకొన్న(షిఫ్టెడ్) ఖాళీలు 1582 చూపుతున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఖాళీల వివరాలు

యాజమాన్యం	ఖాళీలు
ప్రభుత్వ	125
ఎంపీపీ/జెడ్పీ	1583
మున్సిపల్ కార్పొరేషన్	135
మున్సిపల్	75
5/8 ఏళ్లు ఒకేచోట పనిచేసిన టీచర్లు	3000
మిగులు పోస్టులు	500
రీ అపోర్షన్/ షిఫ్టెడ్	1582
మొత్తం	7000

బదిలీల షెడ్యూల్ ఇలా..

ప్రక్రియ	హెచ్‌ఎం	స్కూల్ అసిస్టెంట్	ఎస్జీటీ
బదిలీలకు దరఖాస్తులు	ఈనెల 21, 22	ఈనెల 21 నుంచి 24	ఈ నెల 21 నుంచి 27
పరిశీలన	ఈనెల 21,22	ఈ నెల 21 నుంచి 25	ఈనెల 21 నుంచి 28
ప్రొవిజనల్ సీనియారిటీ జాబితా	24	26,27	31
గ్రీవెన్స్	25	28	28 నుంచి జూన్ 1
గ్రీవెన్స్ పరిష్కారం	26	28, 29	28 నుంచి జూన్ 2
తుది సీనియారిటీ జాబితా	27	31	జూన్ 6
వెబ్ ఆప్షన్స్	28	జూన్ 1, 2	జూన్ 7 నుంచి 10
బదిలీ ఉత్తర్వులు	30	జూన్ 4	జూన్ 11
ఉద్యోగోన్నతులు	మే 30 (ఎస్ఏ నుంచి హెచ్‌ఎం)		జూన్ 5 (ఎస్జీటీ నుంచి ఎస్ఏ)
ఉద్యోగోన్నతులు ఉత్తర్వులు	మే 31		జూన్ 6

పకడ్బందీగా చేపడతాం

బదిలీల కసరత్తు నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించడం జరుగుతుంది. బదిలీలు నిబంధనల మేరకు చేపడుతాం. ఇందులో ఎలాంటి అనుమానాలకు ఆస్కారం లేదు. టీచర్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. తప్పులు లేకుండా దరఖాస్తు చేసుకోవాలి. బదిలీల విషయంలో దళారుల మాటలు నమ్మకూడదు. ఎవరైనా మోసాలకు పాల్పడితే శాఖాపరంగా చర్యలు కఠినంగా ఉంటాయి. – కేవీఎన్ కుమార్, డీఈఓ

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

చంద్రగిరి : మండలంలోని ముండ్లపూడి వద్ద బుధవారం ఉదయం ఓ అంతర్రాష్ట్ర దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ ప్రసాద్ వివరాలు వెల్లడించారు. తిరుపతి రూరల్ మండలం కొత్తూరు గ్రామానికి చెందిన కుమార్‌రాజా అనే వ్యక్తి ఇంట్లో ఈ నెల 1వ తేదీన చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బెంగళూరుకు చెందిన నాగరాజ అలియాస్ వాసును అదుపులోకి తీసుకుని విచారించగా వాస్తవం వెల్లడైంది. నిందితుడి నుంచి 168.55 గ్రాముల బంగారు, 192.5 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కర్ణాటకలోని పలు పోలీస్‌స్టేషన్లలో దోపిడీ, చోరీ కేసులు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. కేసును ఛేదించిన సీఐ సునీల్‌కుమార్, ఎస్ఐలు అరుణ, సాయినాథ్ చౌదరి, జగన్నాథరెడ్డి, సిబ్బంది ప్రసాద్, ప్రభాకర్‌ను ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

తిరుపతి సిటీ : దైనందిన జీవితంలో యోగాను భాగంగా మార్చుకుంటే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో యోగా మాసోత్సవాలను ప్రారంభించారు. తొలిరోజు ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో కలసి ఆయన యోగాసనాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కలెక్టర్ మట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా డే సందర్భంగా కర్టన్ రైజర్ యోగాంధ్రా–2025కు విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు.ఈ క్రమంలోనే ఈ నెల 21 నుంచి జూన్ 21వ వరకు యోగా మాసంగా ప్రభుత్వం ప్రకటించినట్లు చెప్పారు. ఎమ్మెల్యే ఆరణి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి రోజుకు కనీసం గంటపాటు యోగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. యోగాడేలో ప్రజలు భాగస్వాములై విజయవంత చేయాలని పిలుపునిచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ సామూహిక యోగాలో పెద్దసంఖ్యలో జనం పాల్గొని రాష్ట్ర ప్రతిష్టను ఇనుమడింప చేయాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజని, డీఆర్‌ఓ నరసింహులు , ఆర్‌డీఓ రామ్మోహన్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, గ్రీనరీ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ సుగుణమ్మ, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల కూల్చివేతపై ధర్నా



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నేతలు

తిరుపతి తుడా : పేదలపై కార్పొరేషన్ అధికారులు ప్రతాపం చూపించడం సరికాదని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మండిపడ్డారు. బొంతాలమ్మగుడి వద్ద చిరు వ్యాపారుల దుకాణాలు తొలగించినందుకు బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.రాధాకృష్ణతో కలసి మురళి మాట్లాడుతూ ప్రత్యామ్నాయ స్థలం చూపించకుండా వీధి వ్యాపారుల పొట్టకొట్టడం దారుణమన్నారు. నగరంలో కూటమి నేతలు, టౌన్ ప్లానింగ్ అధికారులు ఇష్టారాజ్యంగా మామూళ్ల వసూలు చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రధానంగా జనసేన నేతల దందాలు పెరిగిపోయాయని విమర్శించారు. అన్నీ తెలిసినా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు బాలాజీ, మూర్తి కుట్రపూరితంగా వీధి వ్యాపారుల షాపులు తొలగించారని, ఇప్పుడు అదే స్థలంలో జనసేన నేతల ఆధ్వర్యంలో దుకాణాలు పెట్టించారని మండిపడ్డారు. నేతలు సుబ్రమణ్యం, బుజ్జి, వేణు గోపాల్, కేవై రాజా, ఎమ్‌డీ రవి, సీహెచ్ శివకుమార్, మణి, ఎన్.శివ, వెంకటేష్, సురేష్, మహేంద్ర, రైల్వే బాల, ప్రమీల, శ్రీనివాసులు, బాలాజీ, సుధాకర్, రమేష్, దీపక్ పాల్గొన్నారు.